# 2

# అమ్మ

''క్రిగేదె....క్రిగేదె....
కాలం దాటిపోయిన
క్రిగేదె.....''

ఆ రాత్రి అమ్మా నాన్నా దెబ్బలాడు కొన్నారు. ఆ రోజే అన్న మాటేముంది ప్రతి రోజు వారు దేనికోదానికి దెబ్బలాడుకొంటూనే ఉంటారు. కొన్ని సంవత్సరాలుగా ఇంట్లోవారికి అలవాటు పడిన దినచర్యగా మారి పోయింది వారి పోట్లాట. అలా వారిద్దరూ దెబ్బ లాడు కోకుండా నవ్వుతూ, తూలుతూ కబుర్లు చెప్పుకొన్న రోజులు నాకు కొద్దిగా జ్ఞాపకం లేకపోలేదు. ఆ రోజుల్లో అమ్మా. నాన్నా, నేను. సాయంకాలం అవగానే ఏ సినిమాకో, బజారుకో, పార్కుకో పోయి తిరిగి వచ్చేవారము. నాన్న కిష్టమైన వంటలు ఏరి కోరి చేసి పెట్టేది అమ్మ. నాన్న ఆఫీసు నుంచి వస్తూ నాకు పిప్పెరమెంట్లు, బిస్కెట్లు కొని తెచ్చేవారు. అమ్మకి రకరకాల పువ్వులు తెచ్చి ఆప్యాయంగా జడలో పెట్టేవారు.

ఆ రోజులు కన్నుచాటు చేసి కరగి పోయేయి. ఎప్పుడు కరగి పోయేయో....ఎలా తరలిపోయేయో నాకిప్పుడు గుర్తు లేదు. పెద్ద తమ్ముడు వాసు పుట్టిన తరువాత కూడా మేమిద్దరం చెట్టపట్టాలు వేసుకొని పార్కులో తిరగడం. నాన్న తెచ్చిన మిఠాయిని పంచుకు తినడం నాకు గుర్తుంది. వాసు పుట్టిన రెండేళ్లకి పంకజం పుట్టింది. ముగ్గురు పిల్లల్ని వెంటేసుకొని అమ్మ ముందులా పార్కులకి, సిని మాలకి తిరక్కపోయినా ఈ విధంగా ఇంట్లో నిత్యాగ్నిహోత్రాలు రాజుకోడం ఇంకా ఆ రోజుల్లో ఆరంభం కాలేదు.

లలిత కడుపున పడ్డం అమ్మ జబ్బు పడ్డం, నాన్నకి ఇంకో వూరుకి ట్రాన్స్‌ఫర్ కావడం అన్నీ ఒక్కసారిగా ఉప్పెనలా ముంచు కొచ్చేయి. ఆరు నెల్లపాటు ఇంట్లో ప్రతి విషయానికీ ముజ్జిడ్డుగానే

తయారయింది. ఒక విధంగా చెప్పాలంటే అమ్మా నాన్నల మధ్య అంతవరకు నిల్చిన ఏదో ఒక ఏకాభిప్రాయం ఆ సమయంలోనే సడలిపోవడం మొదలయింది. ఇంట్లో అయిన దానికి, కాని దానికి దెబ్బలాటలు.. అవసరం ఉన్నా లేకున్నా నాన్న తన ఆధిక్యాన్ని చూపుకోడానికి పడే తాపత్రయం., అది వరకు అతి సహజంగా నాన్న అజ్ఞల్ని అభిమానంతో పాటించే అమ్మ తనూ మనిషి నంటూ ఎదురు తిరిగి జవాబులు చెప్పడం—ఇలా ప్రారంభమయేయి—ఇంట్లో కలతలు, కన్నీళ్లు.

మొదట్లో పిల్లలం తిళ్లూ, తిప్పలూ మాని దెబ్బలాడు కొంటున్న అమ్మా, నాన్నల వంక బెగ్గిలిపోయి చూస్తూ, నవ్వన్నది ముఖాల మీద లేకుండా, చిరుత ప్రాయపు ఆలోచన లన్నవి మనసులోకి రాకుండా, పుట్టి పెరిగిన ఇంట్లోనే దొంగల్లా నక్కి, నక్కి తిరిగే వారం. కాలం గడుస్తుంటే పెద్దవారి మాటలు, వాదులాటలు, చిన్న పిల్లలకి ఆటలుగా మారిపోయేయి. లలిత, చిన్నానాడు ఆడే వంతు లాటల్లో నాన్న పాత్రధారి దేనికో దానికి విధిగా ఎగిరిపడేవాడు. అమ్మ స్థానం తీసుకున్న పిల్ల ముక్కు చీదుతూ, మూతి విరుస్తూ ప్రతి దానికి కయ్యానికి సిద్ధమయేది.

కాస్త వయసు వచ్చిన నాకు ఆ చిన్న పిల్లల మనసుల మీద ఇంటి వాతావరణం ఎంత క్రూరమైన ముద్ర వేసిందో, అది వారి భావి జీవితాన్ని ఏ విధంగా కలుషితం చేయగలదో అర్థమయేది. కాని దాని నుండి వారిని తప్పించడానికి కాని, అమ్మా నాన్నలను పోట్లా డుకోవద్దని వారించడానికి కాని అనువైన వయసు నాకు లేదు. కొంత కాలానికి ఆ రకమైన వాతావరణానికి ఇంట్లో అంతా అలవాటు పడి పోయేము. పెరిగి పెద్ద దాన్ని అయి ఇరుగు, పొరుగు ఇళ్లలో విష యాలు ఆకళింపు చేసుకొంటున్న కొద్దీ, ఇది మా ఒక్కింట పుట్టిన వింతేం కాదని; ఈ రకమైన సంసారాల్లో సర్వ సాధారణంగా వచ్చే పరిణామాల్లో ఇదీ ఒకటని తెలుసుకొన్నాను.

ఇటీవల కాలంలో అమ్మా నాన్నల దెబ్బలాటకి మొదటి కారణం ఏదైనా చివరికి తేలే పర్యవసానం నా పెళ్లి గురించిన అమ్మ ఆరా

టమే. నాకు పదమూడో ఏడు జొరబడిన రోజున 'పెళ్లికాని ఆడపిల్ల గుండెల మీద కుంపటి' అన్న మాట అమ్మనోటి వెంట మొదటి సారిగా విన్నాను. అది మొదలు ఆ మాటని రోజు కెన్ని సార్లు విన్నానో....ఇంకా ఎన్నిసార్లు వినవలసి వస్తుందో నేను చెప్ప లేను. ఆ కుంపటిని కదలించడానికి నాన్న తన ప్రయత్నాలు తాను చేస్తున్నా ఇంకా అవి చాలవని అమ్మ అభిప్రాయం.

'చదువు కొంటున్నాను కదమ్మా....అంతగా పెళ్లి కాకపోతే ఉద్యోగం చేసుకు బ్రతుకుతాను. దాని కోసం నాన్నతో రోజూ పోట్లాడకమ్మా' అంటే అమ్మ వినదు. 'పెళ్లికాని ఆడపిల్ల ఈనాటి సంఘంలో ఒంటరిగా బ్రతక గలదా? తోడేళ్లలా వెంటబడే మగాళ్ల మధ్య నీతిగా బ్రతకడం అంటే మాటలనుకున్నావా? పిల్ల కాకి కేం తెలుసు ఉండేలు దెబ్బ? అన్నిటికీ తగుదునమ్మా అంటూ బయలు దేరకు' అంటూ నా నోరు మూయించేది అమ్మ.

అమ్మ ఎంత పోరినా, నాన్న కాళ్లరిగేలా ఎంత తిరిగినా ఆ సంవత్సరం కూడా నా పెళ్లి స్థిరపడలేదు. కారణం.... వరుడికి చెల్లించవలసిన ముడుపు నాన్న దగ్గర సిద్ధంగా లేదు. అది ఏనాటి కైనా సిద్ధపడ గలదన్న నమ్మకమూ లేదు. అయినా నాన్నకి తిరుగు లేని నమ్మకం.. ఏదో నాటికి తన కూతురికి ఏ ఇంజనీరునో, డాక్టరునో వరుడిగా తేగలనని.

అడుగడుక్కీ అమ్మ అడ్డువస్తున్నా నాన్న ఇస్తున్న భరోసాతో నా చదువు మెట్రిక్యులేషన్ వరకు సాగింది. అమ్మ దృష్టి వయసులో ఉన్న కుర్రాళ్లని దాటి రెండో పెళ్లి వాళ్ల మీదికి మళ్లుతున్న సమయంలో టైపు, షార్టు హేండ్ పరీక్షలు రాసి వచ్చేను. 'ఈ ఫలితాలు తెలిసి పరీక్షలు పాసైతే ఉద్యోగం చేస్తానంటూ ఎగబడుతుంది. అప్పుడు దాన్ని కాదూ కూడదూ అని ఒప్పించడం కష్టం. ఈ లోగా ఆ గండికోట వారి అబ్బాయికో, అనంతపురం వారి మేనల్లుడికో ఏదో ఒకటి సెటిలు చెయ్యండి' అంటూ ఆ రాత్రి భోజనాల సమయంలో నాన్నని ఒత్తిడి చేసింది అమ్మ.

'అదృష్టం కలిసొచ్చి అది ఉద్యోగం చేస్తానంటే పోయేదేముంది? చెయ్యనీ.... సంబంధాలు చూస్తూనే ఉందాం. ఏదో ఒకటి కలిసి వస్తే అప్పుడే మానేస్తుంది' అన్నారు నాన్న, ఇందులో కంగారు పడ్డాని కేముందన్న ధోరణిలో.

దానితో అమ్మ రెచ్చిపోయింది. "ఇంత కాలం ఈ నాన్పుడికి కారణం ఇదన్నమాట. ఆడపిల్లకి పెళ్లి చెయ్యకుండా, దానిచేత ఉద్యోగం చేయించి ఇల్లు తిప్పుకోవాలను కొంటున్నా రన్నమాట. ఏడుగురి పిల్లల తండ్రైౖ ఆ మాట అనిందికి సిగ్గేనా లేకపోయిందా? దాని వయస్సెంతో జ్ఞాపకం ఉందా? ఆ ఈడుకి నేను ఇద్దరు పిల్లల తల్లి నయేను."

"దాని వయసుకేముందే? పద్దెనిమిది వెళ్తాయేమో....అప్పుడే పెళ్లీడు దాటిపోయిందన్నట్లు మాట్లాడు తున్నావు!" నాన్న తన వాదనని బలపరుచుకో చూసేరు.

"దాటి పోయిందని కాదు....దాటిపోతే ఎవరూ ఈపాటి కూడా ముఖం చూపించరని....కాలంలో ఉన్న కర్రిగేదైనా బాగుంటుం దిట....ఇంకా ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే...."

ఈ కర్రిగేదెకి ఉన్న రూపు కూడా పోతుందని అమ్మ భయం. "శంకరయ్య అన్ని సంబంధాలు తెస్తున్నా ఒకటి కాకపోతే ఇంకొక టైనా కలిసిరాక పోడానికి కట్నంతోపాటు పిల్ల రూపురేఖలు కూడా అంతంత మాత్రంగా ఉండడమే కారణం" అంటూ అమ్మలక్కలు చెవులు కొరుక్కోడం చాలా సార్లు విన్నాను. మరీ అంత అంద హీనంగా ఉంటుందా నా ముఖం? పక్కనే ఉన్న అద్దంలో పరీక్షగా చూసుకొన్నాను.

ఆ చిరు వెలుగులో నా ముఖం నా కెంతో ఆప్యాయంగా కన్పిం చింది. వైవాహిక జీవితంపట్ల నే నేర్పరచుకొన్న తీయ తీయని కోరికలన్నీ నా కళ్లలో మెరుస్తున్నాయి. అమ్మలా నేను అందంగా లేకపోవచ్చు....కాని నా ఇంటిని అమ్మకన్న అందంగా తీర్చి దిద్దుకో గలను. అమ్మలా మాట మాటకి భర్తతో దెబ్బలాడను. చిన్నపిల్లల

ముందు అసలు పోట్లాడను. బ్రతుకులో తీపిని చవి కూడకముందే వారి నోళ్లలో జీవితంపట్ల నిరుత్సాహం, నిర్లిప్తత అనే చేదు కషాయాన్ని రంగరించి పొయ్యను. జీవితంలో ఏనాటికైనా వాళ్లు చేదు చవి చూడవలసి వస్తే ఆ చేదులో అంతర్గతంగా ఉండే తీపిని ఆస్వాదించి తృప్తిపడేలా వారిని పెంచుతాను.

ఆ మధురమైన ఆలోచనలు కలలలోకి జారిపోయి, కాలంతో పాటు ఆ కలలు కరగిపోయి తిరిగి నేను కళ్లు తెరచేసరికి బాగా తెల్లవారి పోయింది.

నాన్న మంచం కాళీగా ఉంది. "నాన్నేరమ్మా?" పక్క గదిలో ఏమో సవరిస్తున్న అమ్మని ప్రశ్నించేను. "ఈ రోజు నుంచీ డ్యూటీ వేళ మారింది. తెల్లవారగట్ల మూడింటికి వెళ్లిపోయేరు."

నాన్నపక్క పరిచింది పరచినట్లే ఉంది. కాస్త సేపైనా మనిషి నడుం వాల్చిన ఆనవాళ్లు లేవు. డ్యూటీకి వెళ్లేవరకు అమ్మ నాన్నతో వాదులాడుతూనే ఉందా? అలసిన శరీరంతో, విసిగిన మనసుతో నాన్న అలాగే పనిలోకి వెళ్లేరా? ఎందుకో నా మనసులో బాధ కలుక్కుమంది.

ఉదయం పది గంటలవేళ పుట్టెడు జ్వరంతో తిరిగొచ్చేరు నాన్న.

"కాంతం! నీ మాటే కానీ ....అమ్మాయికి ఏదో వో సంబంధం నిశ్చయం చేస్తాను. త్వరలోనే పెళ్లి చేసేద్దాం" అంటూ జ్వర తీవ్రతలో నాన్న ఒకటే పలవరింతలు.

ముందు రోజు రాత్రి ఆ మాట నాన్ననోట వినడం కోసం హోరాహోరిన పోట్లాడిన అమ్మ, ఆ స్థితిలో ఉన్న నాన్ననోట ఆ మాటలు విని కళ్ల నీళ్లు పెట్టుకొంది. వారం రోజులైనా నాన్న జ్వరం తగ్గలేదు. అమ్మ మతిపోయిన దానిలా నాన్న మంచాన్ని కరుచుకు కూర్చుంది. మందులు, డాక్టర్లు, వచ్చీ, పోయే చుట్టాలు, స్నేహితులు..........ఇంటి వాతావరణమే పూర్తిగా మారిపోయింది. నాన్న పలు మాటలు విన్నవారంతా నాన్నవంక, నావంక జాలిగా చూడ్డం నాకు భరించరాని శిక్షగా తయారయింది. రోజులు గడుస్తుంటే నాన్న జబ్బుకి నేనే కారణం అన్నట్లు అమ్మ విసు

క్కొంటుంటే, ఏడుస్తుంటే....ఏం చెయ్యాలో, ఆమెని ఎలా వోదార్చాలో తెలియక తికమక పడేదాన్ని.

మా ఇంటిని, నా జీవితాన్ని చీకటితో నింపిన ఆ రాత్రి అందర్నీ వదలి నాన్న వెళ్ళిపోయేరు. తన ఏడుగురు పిల్లల్ని దగ్గరికి తీసుకొని బావురుమంది—అమ్మ.

నాన్న లేని ఇల్లు వెల వెల పోయింది. నాన్నలేని అమ్మ మూగ బోయింది. ఆడపిల్లనైనా అమ్మ సంతానంలో పెద్ద దాన్ని కాబట్టి అమ్మతోపాటు ఆ ఇంటి బరువు బాధ్యతలు పంచుకోక నాకు తీర లేదు అమ్మకి ఇప్పుడు నేను గుండెలమీద కుంపటిని కాను.చేదోడు.... వాదోడు....

అదృష్టం కలిసొచ్చి నాన్న పోయిన రెండు నెల్లకి మంచి పేరున్న ఒక కంపెనీలో టైపిస్టు ఉద్యోగం దొరికింది. అంత కన్న సంతోషం కలిగించిన విషయం, ఆ ఆఫీసులోనే పనిచేస్తున్న మూర్తి రాజుతో స్నేహం. అతడి మంచి హృదయం, పరోపకార బుద్ధి అచిరకాలంలోనే అతడిని ఇంట్లో అందరికీ ఆప్తుడిగా చేశాయి. నన్నూ, నా మనసునీ అర్థం చేసుకొని సానుభూతి చూపగలిగే వ్యక్తిని కలుసుకొన్నానన్నదే నా సంతోష కారణం.

క్షణక్షణానికి కదలడమే నైజంగా గల కాలం ఎవరి కోసం.... దేనికోసం ఆగదు. "ఈ రోజు నీ పుట్టిన రోజు" అంది అమ్మ కంచంలో అన్నం వడ్డిస్తూ.

"ఎన్నేళ్లు?" అన్నాను, ఉసిరికాయ పచ్చడి అన్నంలోకలుపుతూ.

"పాతిక" అమ్మ కంఠంలో ఏ భావం పలకలేదు.

పాతిక....అంటే ఇరవై అయిదు....నాన్న పోయి ఏడేళ్ళయింది. వాసు ఇల్లు వదలిపోయి మిలటరీలో చేరి అయిదేళ్ళయింది, పంకజం పెళ్ళయి మూడేళ్ళయింది. గడచిన కాలాన్ని కొలవడానికి ఎన్ని అనుభవాలని లెక్క పెట్టను? పగలంతా ఆఫీసు పనితో, రాత్రివేళల తుదీ. మొదలూ లేని ఆలోచనలతో గడచిపోయిన ఈ కాలాన్ని,

ఒంటి మీద స్వారి చేస్తున్న ఇరవై అయిదు సంవత్సరాలని ఎంత కొలిస్తే తరుగుతాయి? ఏ విధంగా కప్పబడ్తాయి?

ఈనాడు ఇరవై అయిదేళ్ల కన్య ఈ కళ్యాణి. పదహారేళ్ల పుట్టిన రోజునాడు కూతురికి ఇంకా పెళ్లి కాలేదని బాధపడ్డ అమ్మ.... ఈ ఇరవై అయిదో పుట్టిన రోజునాడు 'పాతిక' అని ఎంత నిర్లిప్తంగా చెప్ప గలిగింది!

తలెత్తి అమ్మ కళ్ల వంక చూసేను. ఆ కళ్లలో అనాటి ఆవేదన లేదు. తీరని కోర్కెల జాడలు, తీర్చుకోవాలన్న కాంక్ష వాటిలో కన్పించ లేదు. కాలం దాటిపోయిన ఈ కర్రిగేదెకి ఇంక పెళ్లి కాదనుకొని నిరాశ చెంది ఉంటుంది. ఆ నిరాశవల్ల జనించిన నిర్లిప్తత మాత్రమే ఆమె మాటలో ధ్వనించింది.

ఆఫీసుకి వెళ్లిపోతూ మరొక సారి అద్దంలో ముఖం చూసుకొన్నాను. అనాటి రాత్రి చిరువెలుగులో నా ముఖం నాకు ఆప్యాయంగా కన్పించింది. ఈనాటి పగటి వెలుగులో నా ముఖం హేళనగా ఒకానొక నాటి నా మనసులోని కోర్కెల్ని దృష్టికి తెచ్చి ఫక్కున నవ్వింది. పాతికేళ్లకే బ్రతుకులోని కష్టాల్ని రుచి చూసిన ముఖం, పాతికేళ్లకే మోయలేని సంసార భారంతో వడలిపోయిన ముఖం అద్దంలో తన రూపు అందంగా నిల్పుకోలేక పోయింది. "కర్రిగేదె.... కర్రిగేదె.... కాలందాటి పోయిన కర్రిగేదె...." మనసులోని ఏడ్పును సభ్యత నేర్చిన పెదవులు చిరునవ్వుగా ప్రకటించేయి. అద్దాన్ని యథాస్థానంలో పెడ్తూ చిన్నగా నవ్వుకొన్నాను.

ఆ రోజు బస్సు తొందరగా దొరికింది. నా పెదవుల మీద నవ్వు ఇంకా పూర్తిగా వెలిసిపోకముందే ఆఫీసు చేరుకొన్నాను. వరండాలోనే ఎదురు పడ్డాడు, మూర్తిరాజు. "ఇంతకాలానికి మీ ముఖం మీద నవ్వు చూసేను. ఈ రోజు ఎంతో శుభ దినం" అన్నాడు, తృప్తిగా నా వంక చూస్తూ. ఏదో జవాబు చెప్పాలని నోరు తెరచేను. కాలందాటిన కర్రిగేదె పలుపుతాడు సడలించుకోవాలని వృథా ప్రయత్నంచేస్తూ కళ్ల ముందు కదలాడింది. చెప్పాలనుకొన్న జవా

బుకి బదులుగా అంత వరకు నాలిక చివర ఆడుతున్న మాటే అప్ర యత్నంగా తోసుకు వచ్చింది. "కర్రిగేదె" అన్నాను అతని వైపు చూస్తూ.

నా మాట అర్థంకాక అతడు నా వంక వింతగా చూసేడు.

'ఏ మంటున్నారు?' అన్నాడు.

అప్పటికి ఉదయాన్నే మనసులో చోటు చేసుకొన్న జవాబు పూర్తిగా తొలగిపోలేదు. "కాలం గడచిపోయిన కర్రిగేదె" అన్నాను అదే ధోరణిలో.

'మీరే మంటున్నారో నా కర్థం కావడంలేదు' తెల్లబోతూ అన్నాడు అతడు.

'ఈ రోజు నా పుట్టిన రోజు.'

'కంగ్రాట్యులేషన్స్....మరి ఆ మాట చెప్పరేం?' ఎంతో ఉత్సాహంగా చెయ్యి ముందుకి చాచేడు.

ఆ చెయ్యి వెంటనే అందుకోవాలనీ, వదలకుండా నాది చేసుకోవాలనీ మనసు ఉరకలు పెట్టింది. 'అదే చెప్తున్నాను' అన్నాను ఆశల్ని అదుపులో పెట్టుకొంటూ నెమ్మదిగా.

'నాకు వినిపించినంతవరకు మీరదేం చెప్పలేదు....కర్రిగేదె....ఎర్రగేదె అంటూ ఏమో అంటున్నారు. దానికి మీ పుట్టినరోజుకి సందర్భం ఏమిటో....?'

'నా వయసు పాతికేళ్లు....అంటే ఇరవై అయిదు. ఏనాడో మైనార్టీ తీరిపోయింది. కాలంలో ఉన్నప్పుడు కర్రిగేదైనా బాగుంటుందిట....మా అమ్మ అంటుండేది....'

ఆఫీసు మధ్యహాలులో ఉన్న గోడ గడియారం పది గంటలు కొట్టింది. వరండాల్లోను, చుట్టుపక్కల చలనం కలిగింది. ఆ సమూహంలో ఒకతెగా ముందుకి కాలు కదిపేను. మూర్తిరాజు నా అడుగుల్ని అనుసరించేడు. మధ్య హాల్లో ఇద్దరం విడిపోయేం. అతడి సీటు అటు....ఆఫీసరు గది ఇటు.

ఆ రోజు లంచ్ అవర్‌లో కూడా ఏవో అర్జెంట్ లెటర్స్ డిక్టేటు చేస్తూ ఉండిపోయేడు ఆఫీసరు. ఆ పుణ్యకాలం కాస్తా అలా గడిచి

పోయింది. ఆ పని పూర్తి చేసి బైటపడే సరికి మూర్తిరాజు నా కోసం కాచుకు కూర్చున్నాడు. "ఇంక ఇప్పుడు ఏదానికి టైము లేదు. మీరు వెళ్ళవలసింది" అన్నాను ఆప్యాయంగా.

'నేను చెప్తూనే ఉన్నాను. పాపం మూర్తిరాజుగారు మీ కోసం ఎదురు చూస్తూ తనుకూడా కాఫీ మానుకొన్నారు' అంది ప్రక్క సైపిష్టు, అదోలా పెదవి విరుస్తూ.

అటువంటి మాటలకి జవాబు ఇయ్యవలసిన అవసరం లేదని ఆ ఆఫీసులో చేరిన వారం నాటికే నేర్చుకొన్నాను. ఆమె మాటలు విననట్లు ఉత్తరాలు టైపు చెయ్యడంలో మునిగిపోయేను.

ఆ సాయంకాలం కూడా అంతా వెళ్లిన మరి కాస్సేపువరకు నా పని మిగిలిపోయింది. పని ముగించి అలసటగా ఆఫీసునుంచి బైట పడ్డాను. వీధి చివర బస్సుస్టాపు దగ్గర నా కోసం ఎదురు చూస్తున్నాడు మూర్తిరాజు.

'ఈ రోజు ఇటునిలబడ్డారేం.... అటువైపు కదా మీ పన్నెండో నెంబరు బస్సు వచ్చేది?' అన్నాను.

'ఈ రోజు మీతోపాటు ఇంటికి రావాలని....'

'పుట్టింరోజు కదా ఇంటికొచ్చి కేకులు, గీకులు తినొచ్చనుకొంటున్నారేమో? అలాంటి ఆశలేం పెట్టుకోకండి....ముందే చెప్తున్నాను. భోజనానికి ఉంటానని మొండికేసినా మీకు దక్కేవి ఉదయం చేసిన ఉసిరికాయ పచ్చడి, మిరియాల చారు మాత్రమే....'

'తిండి కోసం వస్తున్నానని మీ కెవరు చెప్పేరు?'

'మరెందు కొస్తున్నట్లు?'

'మీ ఇంటికి వచ్చి మీ అమ్మగారితో చెప్పాలని.'

'ఏమిటో?'

'కాలం గడిచిన ఈ కర్రి గేదంటే నాకెంతో ఇష్టమని....పలుపు తాడు వేసి మా ఇంటికి తీసుకుపోతానని....' మనసు నిండుగా అన్నాడు ఆ మాట.

'రాజూ' ఆనందం. ఆశ్చర్యం ధ్వనించేయి నా పిలుపులో.... అతన్ని ఎప్పుడూ అలా నే పిలవలేదు ....ఆ సమయంలో ఆ పిలుపు నా నోట ఎందుకు వచ్చిందో నే చెప్పలేను.

అతడు క్షణకాలం నా వంక వింతగా చూసేడు. అతని కళ్లలో తృప్తి.... అతడి మనసు పొరలుతున్న ఆనందం....దాన్ని అదిమి పెట్టలేక ఉక్కిరి బిక్కిరి అయేడు. ఏం చెయ్యాలో....ఏ మనాలో నిర్ధారించుకోలేక తడబడ్డాడు.

"ఎంతకాలంగానో అనుకొంటున్నాను ఈ మాట. ఈ రోజు మిమ్మల్ని మీరు అలా కించ పర్చుకొంటుంటే....నా కళ్లలో మీ రూపుకున్న విలువ. నా మనసులో మీ వ్యక్తిత్వానికున్న స్థానం ఎంత ఉన్నతమైనవో తెలియ జెయ్యాలని....కాని ఎలా చెప్పను? ఏం చెప్పినా నా భావాల ముందు ఆ మాటలు హీనంగానే విన్పిస్తాయి ..."

పదో నెంబరు బస్సు వచ్చింది. సాయంకాలంపూట ఉండవలసినంత రద్దీగానూ ఉంది. ఇద్దరికీ చెరో దగ్గర నిల్చిందికి స్థలం దొరికింది. 'తొందర పడకండి....మరోమారు బాగా ఆలోచించుకోండి' అన్నాను. నెమ్మదిగా అటు నడుస్తూ.

'ఇంకానా....అయిదేళ్లుగా ఆకాంక్షిస్తున్నా....రాత్రి. పగలూ ఆరాధిస్తున్నా ఇంకా ఆలోచనే?' అతడి మాటలు సరుగుడు మొక్కలు పాడే సంగీతంలా విన్పించేయి.

బస్సు బయలుదేరింది. రోజూ చూస్తున్న మనుష్యులు. ఇళ్లు, చెట్లు, చేమలు ఆ రోజు కొత్తగా కన్పించేయి. బస్సులో ఉన్న అందరి ముఖాల్లో ఎందుకో అంతులేని ఉత్సాహం పొంగిపొరలుతున్నది. ఏమయింది? ఈ రోజు అంతా ఇంత సంతోషంగా ఎందుకున్నారు? ఈ రోజు పండుగా....పర్వదినమా....ఫస్టుతారీకా? ఏమిటీ సంతోషానికి కారణం?

'నీ మనసులోని భావాల్ని ఎదుటివారిలో చూస్తున్నావు....నీలో పొంగులువారుతున్న ఆనందం పరిసరాల్లో ప్రతిఫలిస్తున్నాది.... అంతే' ఎవరో చెవి దగ్గరగా నోరు పెట్టి సమాధానం చెప్పినట్లయింది.

'దిగండి....మన స్టాపొచ్చింది.'

మూర్తిరాజు తట్టి పిల్చేవరకు ఆ విషయమే గుర్తించలేదు. అర గంట ప్రయాణం....అప్పుడే గడచిపోయిందా? ఆశ్చర్యంగా చూసి అతని ప్రక్కనే నడక సాగించేను.

'ఇది ఏళ్ల తరబడిగా నాలో కదలాడుతున్న కోరిక. ఈ నాటికి ధైర్యంగా మీ ముందు నిల్చి అర్థిస్తున్నాను. మీరు నిండు మనసుతో నా కోరిక మన్నిస్తారని....'

అమ్మ అనుజ్ఞ పొందడానికి ఇంకా అతనేమేమో అంటున్నాడు. ఆ మాటలు నా చెవిలో పడలేదు. పడ్డవాటిని కూడా సరిగా అర్థం చేసుకొనే స్థితిలో మనసు లేదు. అమ్మ చెప్పబోయే జవాబు కోసం నా మనసు తహ తహ లాడింది. వయసొచ్చిన తన కూతురికి తగినంత కట్నం పెట్టలేని కారణంగా పెళ్లి కాలేదని పదేళ్ల క్రిందటే అల్లలాడిన తల్లి, సలక్షణంగా ఉద్యోగం చేసుకొంటున్నవాడు, ఉన్నతమైన భావాలు, ఉదారమైన మనసు కలవాడు. ఏరి, కోరి స్వయంగా వచ్చి పెళ్లి చేసుకొంటానంటే ఏమంటుంది? ఎగిరి గంతేయడం మినహా దానికి ఇంకో జవాబు ఏముంటుంది?

జీవితంలో ఏనాటి నుంచో కలలు కంటున్న శుభదినం ఈనాటికి తనంత తానుగా వచ్చి ముందర నిలిచిందన్న తృప్తి, ఆనందంతో అమ్మ కళ్లలో కదలాడే భావాలు చూడాలని అటు కళ్లు తిప్పేను. ఏ భావం ప్రసరించని ఆ కళ్లు, నాన్న పోయినప్పటినుండి కన్నీరు కార్చడమే కాని నవ్వడం ఎరగని ఆ కళ్లు పాతబడి, రంగు వెలిసిపోయిన గాజు బుడ్లలా ఉన్నాయి. ముభావంగా, అస్పష్టంగా ఏదో గొణిగింది అమ్మ.

ఆ పాటి అంగీకారానికే ఎగిరి గంతేసేడు మూర్తిరాజు. 'రా కల్యాణి, మా అమ్మతోకూడా చెప్పేద్దాం. తన కొడుకు బ్రహ్మచర్యం వదిలించడం కోసం ఆ లోకంనుంచి దిగివచ్చిన దేవతని.... కాదు.... కాదు....పొరపాటు....కర్రిగేదెని మా అమ్మ కూడా చూసి అభినందిస్తుంది.' అన్నాడు మూర్తిరాజు ఆనందంలో మునకలు వేస్తూ.

'వెళ్లిరానా అమ్మా?'

'వెళ్లు.... వేగంగా తిరిగిరా' నూతిలోంచి వచ్చినట్లు అతి దూరంగా, పొడి పొడిగా విన్పించింది అమ్మమాట....

మూర్తిరాజు తల్లి భోజనం చెయ్యందే వెళ్లడానికి వీల్లేదని బల వంత పెట్టింది. ఎంత తప్పుకోవాలనుకొన్నా ఆవిడ పడనీలేదు. 'మొక్కయి వంగనిది మానయి వంగుతుందా అంటారు ఇంకా మూడు ముళ్లు పడక ముందే నా మాట వినని దానివి రేపొద్దున్న వాడిని కొంగున కట్టుకొన్నాక వింటావన్న భరోసా ఏమిటి? ఇలా అయితే ఈ పెళ్లికి నేను చచ్చినా ఒప్పుకోను' అంది ఆవిడ నవ్వుతూ.

'అమ్మగారితో మీరు చెప్పండి. ఇంకో రోజు వస్తాను, అన్నాను మూర్తి రాజు సహాయం కోరుతూ.

'అదేమో నాకేం తెలియదు. నీ ఇష్టం మీ అత్తగారిష్టం' అంటూ అక్కడి నుంచి చల్లగా జారుకొన్నాడు మూర్తిరాజు.

భోజనం చేసి ఎటూకాని సమయంలో బస్సు అందుకొని ఇంటికి వచ్చేసరికి బాగా ఆలస్యం అయింది. 'ఇంక మీరు వెళ్లండి. లాస్ట్ బస్ మిస్ అయితే కష్టం' అన్నాను.

'కష్టం కాదు సుఖం.... అంచక్కా తిరిగి ఇక్కడికే వచ్చేస్తాను' అన్నాడు అతడు చిలిపిగా నవ్వుతూ.

'అపాటి దానికి వెళ్లడం ఎందుకూ?'

'అమ్మతో సాకు చెప్పడానికి.... అసత్యవాద దోషం తగలకుండా ఉండడానికి....' నవ్వుముఖంతో చేయూపుతూ అతడు వెళ్లిపోయేడు.

ఇల్లంతా చిమ్మ చీకటిగా ఉంది. రాత్రి పొడుగునా దివిటీలా దీపం వెలగందే నిద్రపోని బుచ్చిగాడి పక్క దగ్గరగా కూడా దీపం లేదు. ఏమయింది? గాలికి ఆరిపోయిందా! లేక కిర్సనాయిల్ కొద్దిగా ఉండి కొడిగట్టి పోయిందా? అలవాటు పడిన ఇంట్లో తడుము కొంటూ పోయి వరండా గూటిలోఉండే అగ్గిపెట్టి తీసి వెలిగించేను.

ఇల్లంతా శూన్యం....మనుషులున్న జాడలేదు. ఇంత రాత్రివేళ అంతా ఎక్కడికెళ్లేరు? ఇంటికి తాళం అయినా పెట్టకుండా.... అందునా అమ్మ ఎక్కడికెళ్తుంది? ఓరవాకిలిగా వేసిఉన్న పక్కగది తలుపు తోసేను. గదిలో మూలగా ఉన్న మంచం మీద అమ్మ వెల్లకిలా పడుకొని నిద్ర పోతున్నాది. చీమ చిటుక్కుమన్నా లేచి కూర్చునే అమ్మ ఇంత గాఢంగా నిద్రపోవడమేమిటి? ఏదో పాడు శంక మనసులో బల్లెంలా దిగబడింది.

చేతిలో లాంతరు పట్టుకొని దగ్గరగా వెళ్లేను. నలిగిన పక్క మీద అమ్మ—కాళ్లూ, చేతులూ మంచం పట్టె మీంచి కిందికి వేలాడుతూ—పడి ఉంది.

అమ్మ మూసి ఉన్న పిడికిలిలో మడతలతో నలిగి ఉన్న కాగితం.

'అమ్మా' ఏడుపు. ఆర్తం కలగలుపుగా ధ్వనించిన పిలుపు అది. అమ్మ పలక లేదు. ఆమె చేతిలో కాగితం ఆ విషాద గాథ చెప్పింది.

'నువ్వు పక్కన లేందే ఈ బాధ్యత నేనొక్కదాన్నే మొయ్య లేనే కల్యాణీ! అందుకే ఈ నిర్ణయాని కొచ్చేను.—పెళ్లి చేసుకొన్నంత మాత్రాన మిమ్మల్ని దూరం చేసుకొంటానా అమ్మా.... చెల్లెళ్లను, తమ్ముళ్లను నా బిడ్డలతోపాటు చూసుకొంటాను. ఈ బరువు బాధ్యతల్ని మోయడానికి ఇప్పుడు నేనొక్కదాన్నే ఉన్నాను. అప్పుడు మూర్తిరాజు కూడా తోడు ఉంటాడు—అంటావు.

'నువ్వు అలా అంటావని నాకు తెలుసు కల్యాణీ! దానికి మూర్తి రాజు కూడా ఒప్పుకొంటాడని నాకు తెలుసు. కాని ఆడదాని జీవితంలోని ఇంకో విషయం కూడా నాకు తెలుసు తల్లీ! అదే కన్నతల్లి మనసు. తన పిల్లల భవిష్యత్తు కోసం రాయిగా మారి పోగలిగే వెన్న వంటి కన్న తల్లి మనసు.

'ఏడేళ్ల కిందట నీ పెళ్లి అనే మాట వినడానికి ఈ తల్లి హృదయం అహోరాత్రాలు కొట్టు మిట్టాడింది. కాని, ఈనాడు మిగిలిన ఈ పిల్లలకోసం....నీ ఆనందానికి అడ్డుగోడగా నాకు నిలవక తప్ప లేదు.

'ఇది నీ అమ్మ స్వార్థం అను... నలుగురు బిడ్డల భవిష్యత్తు కోసం ఒక కన్న బిడ్డ బ్రతుకును ఎందుకూ కొరగాకుండా కాలరాచిన త్యాగం.... అను ....ఏమన్నా సరే....నా గురించి నువ్వెలా అను కొన్నా సరే....నాకు మీ రంతా ఒకటే తల్లీ....మిమ్మల్ని పెంచి పెద్ద చేసిందికే ఈ నా పోరాటం....ఆనాడు మీ నాన్నతో పోరాడేను.... ఈనాడు....'

'అమ్మా' అంతులేని బాధ నా కంఠంలో సుళ్లు తిరిగింది.

అమ్మ మీద పడి అలా ఎంత సేపు ఉండిపోయేనో,

'సినిమా చాలా బాగుందే అమ్మా....ఎంత బాగుం దను కొన్నావు?' ఏళ్ల తరబడి తీరని కోరిక ఆనాడు తీరిం దన్న తృప్తి పిల్లల మాటల్లో ధ్వనించింది. ఒకర్ని తోసుకొంటూ ఒకరుగా అంతా గదిలోకి వచ్చేరు ...తమ ఆనందాన్ని అమ్మమీద పడి కన్నీరు కారు స్తున్న అక్క. వాళ్లకంతా అయోమయంగా తోచింది.

'అక్కా....అక్కా....అమ్మ కేమయింది అక్కా....' ఒక్కు మ్మడిగా ప్రశ్నించేరు. అమ్మ కేమయిందో....ఎందుకలా అయిందో... ఏమని చెప్పను?

నలుగురి పిల్లల్ని దగ్గరికి తీసుకొని బావురు మన్నాను. నాన్న పోయిన రోజు గుర్తు కొచ్చింది. ఆ రోజు అందరికీ అండగా అమ్మ ఉంది....ఈ రోజు....?